

ఆదివాసీల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మ కొలువైన మేడారం క్షేత్రంలో చరిత్రాత్మక మార్పులు రాబోతున్నాయి. రెండేళ్లకోసారి కోటి మందిని రప్పించే కోన ఆధునిక రూపును సంతరించుకోనుంది. 'మాస్టర్ ప్లాన్' పేరుతో మేడారాన్ని మరింత సౌలభ్యంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ సిద్ధమైంది. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు చెదరకుండా గద్దెలను పునర్నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. సమ్మక్క సారలమ్మ గద్దెలతో పాటు పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలను ఒకే వరుసలో ఉండేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించారు. మహాజాతర వేళ తల్లుల దర్శనం ప్రశాంతంగా జరిగేలా గద్దెల ప్రాంగణాన్ని విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జంపన్నవాగులో నిరంతరం నీళ్లు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. వీటితో పాటు శాశ్వత అభివృద్ధి పనులను ప్రారంభం, కొత్త పనులకు శంకుస్థాపన, గద్దెల కొత్త రీ డిజైన్‌పై గిరిజనులతో చర్చించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మేడారం వస్తున్నారు.

మేడారానికి కొత్త రూపు

- సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు కొత్త డిజైన్
- ఒకే వరుసలో ఉండేలా నిర్మాణానికి ప్రణాళిక
- గిరిజనుల సంప్రదాయాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు
- గద్దెల సాలహారం నలువైపులా విస్తరణ
- మహాజాతర వేళ ప్రశాంత దర్శనం కోసం ఆధునిక చర్యలు
- జంపన్నవాగులో నిరంతరం నీటిని నిల్వ ఉంచేలా ప్రణాళిక
- శాశ్వత అభివృద్ధి పనులతో జాతరకు గుర్తింపు తెచ్చేలా కసరత్తు
- రూ.150కోట్లతో మేడారం మాస్టర్ ప్లాన్ అమలు
- నేడు మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం మహాజాతరను ఆధునీకరించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మాస్టర్ ప్లాన్ పేరుతో జాతరలో శాశ్వత అభివృద్ధి పనులతో పాటు ప్రకృతి దైవాలైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను ఆధునీకరించేందుకు ప్రణాళిక రూపొందించారు. మేడారం జాతరలో సమ్మక్క, సారలమ్మ గద్దెలు ఒక వరుసలో ఉండగా, వీరి ఎదురుగా పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఉన్నాయి. భక్తులు క్యూ లైన్ ద్వారా సమ్మక్క, సారలమ్మ దర్శించుకుని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్దకు రావటం ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో నాలుగు గద్దెలను ఒకే వరుసలో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం గద్దెల చుట్టు ఇనుప (స్టీల్) గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. కొత్త ప్రణాళికలో గద్దెల చుట్టూ గ్రానైట్‌తో నిర్మించాలని ప్లాన్ చేశారు. గద్దెల చుట్టూ గ్రానైట్‌పై సమ్మక్క, సారలమ్మ చరిత్రతో పాటు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజనుల లిపి, ఇతర జాతర వైభవం తెలియజేసే బొమ్మలను చెక్కనున్నారు. ఈ విషయమై పలుమార్లు గిరిజన పూజారులు, పెద్ద మనుషులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, గిరిజన సంప్రదాయాలు దెబ్బతినకుండా గద్దెల డిజైన్‌ను తయారు చేస్తున్నారు. గిరిజనుల అభిప్రాయాలకు అనుగుణంగా నాలుగైదు విధాలుగా అధికారులు గద్దెల డిజైన్లు రూపొందించారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి మేడారంలో పర్యటించనుండటంతో గిరిజనుల అభిప్రాయాల మేరకు ఒక డిజైన్ ఫైనల్ చేసి శంకుస్థాపన చేయనున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

గద్దెల సాలారం విస్తరణ..

మహాజాతర వేళ భక్తులకు సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శన భాగ్యం మహా కష్టమవుతోంది. గంటల తరబడి క్యూలో నిలబడితే ఏ తెల్లవారు జామునో.. అర్ధరాత్రో.. తల్లుల దర్శన భాగ్యం లభించదు. గంటల తరబడి తల్లుల దర్శన భాగ్యం కోసం భక్తులు క్యూ కడితే ఐదారు నిమిషాలు కూడా తల్లులను మనసారా మొక్కుకునే అవకాశం కలుగడం లేదని భక్తుల ఆవేదన. ప్రస్తుతం 32 గుంటల స్థలంలో తల్లుల గద్దెల ప్రాంగణం ఉండగా, సమ్మక్క, సారలమ్మ,

(మిగతా 7లో..)


సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు కొత్త డిజైన్

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

- పలు పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క


మేడారంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించనుండగా ఏర్పాట్లను అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం మేడారంలో పర్యటించారు. హెలీప్యాడ్, రహదారులు, పార్కింగ్ స్థలాలు, సభా వేదిక, విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలించారు. మంత్రి వెంట కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఎస్పీ శబరీశ్, అదనపు ఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి ఉన్నారు. మేడారం పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి 2026 జనవరి 28న నిర్వహించనున్న సమ్మక్క- సారలమ్మ మహాజాతర ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ముందుగా తల్లులను దర్శించుకొని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. శాశ్వత నిర్మాణ పనులకు సంబంధించిన మాస్టర్ ప్లాన్, డిజైన్లను స్లైడ్ షో ద్వారా పూజారులకు వివరించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో ఎస్పీ శబరీశ్ పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు. వెయ్యి మంది పోలీస్ సిబ్బందిని ములుగు నుంచి మేడారం, తాడ్వాయి మార్గాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్, సీసీ కెమెరాలు, వాహనాల తనిఖీలతోపాటుగా ట్రాఫిక్ నియంత్రణ, రూట్ మ్యాప్‌లపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సీఎం పర్యటన సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో ముమ్మరం చేశారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇదీ..

- ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయల్దేరుతారు.
- 10.45 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి హెలీకాప్టర్ ద్వారా ప్రయాణించి మధ్యాహ్నం 12 గంటలకు మేడారం చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.15 గంటలకు సమ్మక్క-సారలమ్మ గద్దెలను సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు.
- అనంతరం పూజారులతో సమావేశమవుతారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. గద్దెల ప్రాంగణంలోని పరిసరాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడతారు. అనంతరం ఆలయ పునరాభివృద్ధిపై స్లైడ్ షోను తిలకిస్తారు.
- 1.30 నుంచి 2.30 గంటల వరకు పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో వేచి ఉంటారు.
- 2.30 గంటలకు తిరిగి హైదరాబాద్ బయల్దేరుతారు.

పిడుగుపాటుకు ఇద్దరు బలి

ఒకరికి తీవ్ర గాయాలు


రాకేష్ (ఫైల్)

దుగ్గొండి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగులు పడిన ఘటనల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లె గ్రామంలో సోమవారం మొద్దు రాకేష్(25) తమ వ్యవసాయ బావి వద్దకు పనుల కోసం వెళ్లాడు. పనులు పూర్తి చేసుకొని ఇంటికి వస్తున్న క్రమంలో సాయంత్రం 6.30 గంటల సమయంలో భారీ వర్షం మొదలైంది. ఇదే సమయంలో పిడుగు పడటంతో రాకేష్ అక్కడికక్కడే చెందాడు. రాకేష్ ఐటీఐ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఒక్కగానొక్క కొడుకు దుర్మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.


కృష్ణ మృతదేహం

ములుగు జిల్లాలో మరొకరు..

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో సోమవారం పిడుగుపాటుతో రైతు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ములుగు మండలంలోని చల్వాక గ్రామానికి చెందిన రైతు ఊకె కృష్ణ(45) అదే గ్రామానికి చెందిన పూనెం చిట్టిబాబుతో కలిసి ఉదయం తన మొక్కజొన్న చేనులో దున్నడానికి వెళ్లాడు. సాయంత్రం చేనులో పనులు చేస్తున్న క్రమంలో పెనుగాలులు, ఉరుములతో వర్షం మొదలైంది. దీంతో ఇద్దరూ పనులను వదిలి చేను పక్కన ఉన్న గుడిసెలోకి వెళ్లారు. ఈ క్రమంలో పెద్దశబ్దంతో గుడిసెపై పిడుగు పడింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా, చిట్టిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడు కృష్ణకు భార్య స్వరూప, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన చిట్టిబాబును వరంగల్‌కు తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎవరికీ అన్యాయం జరగొద్దు

- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎవరికీ అన్యాయం జరగవద్దని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అధికారులకు సూచించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కేసముద్రం మునిసిపల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మునిసిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదార్‌మిస్ మ్యాచ్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, రేషన్‌కార్డు పరిశీలన లాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని చెప్పారు.


అధికారులతో సమావేశమైన భూక్య మురళీనాయక్

మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు (మిగతా 8లో..)

జిల్లాలో ఉరుములతో కూడిన భారీ వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్, గార్ల మండలాల్లో సోమవారం రాత్రి వర్షం దంచికొట్టింది. భారీ ఉరుములతో, పిడుగుల శబ్దాలతో పలు మండలాల్లో దద్ధరిల్లాయి. రాత్రి 7 నుంచి 8.10 గంటల వరకు భారీ వర్షం కురిసింది. కొత్తగూడ, డోర్నకల్, మరిపెడ. నర్సింహులపేట మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆకాశంలో దట్టమైన మేఘాలు అలుముకోవడంతో రాత్రి భారీగానే వర్షం కురిసే అవకాశాలు కన్పిస్తున్నాయి. పెద్దవంగరలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. తొర్రూరు, కురవి, గూడూరు, మరిపెడ, దంతాలపల్లి మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 344.4 మిల్లీమీటర్ల వర్షం కురియగా, సగటున 21.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెద్దవంగరలో 96.8, తొర్రూరులో 48.6, దంతాలపల్లిలో 20.8, మరిపెడలో 25.4, చిన్నగూడూరులో 11.8, నర్సింహులపేటలో 9.6, నెల్లికుదురులో 14.8, కేసముద్రంలో 12.8, గూడూరులో 23.2, మహబూబాబాద్‌లో 8.4, కురవిలో 32.4, డోర్నకల్‌లో 2.2, గార్లలో 12.8, బయ్యారంలో 14.6, గంగారంలో 2.0, కొత్తగూడలో 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో కురుస్తున్న వాన

భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలి

వీసీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, డీఎఫ్‌వో బి.విశాల్

మహబూబాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఈనెల ఖారులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, తగు సూచనలు చేశారు. దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలున్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి నిర్మాణాలు ఆలస్యం కాకుండా ప్రతీ కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని చెప్పారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరగవద్దని, జిల్లాల వారీగా సమీక్షలు చేపట్టి పురోగతి సాధించాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని అన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, డీఎఫ్‌వో బి.విశాల్, జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్‌కుమార్, తొర్రూరు, మానుకోట ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబసభ్యులు
- జిల్లా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌పై దాడికి యత్నం 6

ధర్నా చేస్తే కేసులు పెట్టారు.!

- నారాయణపురం గ్రామ అన్నదాతల ఆవేదన
- 8 మంది మహిళా రైతులతో సహా 36 మందిపై కేసు
- మానుకోట టౌన్ ఠాణా ఎదుట నిరసన వ్యక్తం చేసిన బాధితులు


మానుకోట టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఎఫ్ఐఆర్ కాపీలతో నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భూమి పట్టాదారు పాసు పుస్తకాల కోసం జూన్ 25న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తే.. తమపై కేసులు అక్రమంగా పెట్టారని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఎనిమిది మంది మహిళా రైతులతో సహా.. 36 మందిపై అక్రమంగా కేసులు నమోదు చేయడం దారుణమని తెలిపారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను చూపుతూ, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు ధరావత్ రవి, భూక్య లక్ష్మి, జాటోతు వెంకన్న, లెక్కల రాంరెడ్డి, వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామ రెవెన్యూ పరిధిలో 700 మందికి చెందిన 1100 ఎకరాల సాగుభూమి పట్టాదారు పాసు పుస్తకాలు బాధిత రైతులకు అందలేదు. 8 ఏళ్ల నుంచి పాస్‌బుక్‌ల కోసం రైతులు ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో గత జూన్ 25న బాధిత 50 మంది రైతులం ధర్నా చేశామని, అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టర్ కార్యాలయంకు వెళ్లినట్లు తెలిపారు. పోలీసులు కలెక్టర్‌ను కలువనీయలేదని, విధులకు ఆటంకం కల్గించారని 36 మంది రైతులపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. వీరిలో ఎనిమిది మంది మహిళా రైతులు ఉండడం దారుణమన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీసులు ఈనెల 20న ఫోన్‌చేసి రైతులపై కేసు నమోదైందని, ఆధార్ కార్డుతో పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పడంతో రైతులందరం కలిసి ఠాణాకు వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత రైతులు ఎఫ్ఐఆర్ కాపీ చూపించి, నిరసన తెలిపారు. ఈ విషయంపై టౌన్ సీఐ మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా, అది పాత కేసు అని సమాధానం ఇచ్చారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

చిన్నగూడూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి రెడ్యానాయక్ పరామర్శించారు. ఉగ్గంపల్లి మాజీ ఎంపీటీసీ మహమ్మద్ అఫ్జల్‌బీ కిడ్నీ సమస్యతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న రెడ్యానాయక్ మాజీ ఎంపీటీసీని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కొమురెల్లి, మల్లేశం, సత్యనారాయణ, రాంసింగ్, యాకి, వెంకన్న, గంగరాజు, మల్లయ్య ఉన్నారు.

రైతు రుణమాఫీ పూర్తిగా చేయాలి



తొర్రూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతాంగానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మాజీ అధ్యక్షుడు తమ్మెర విశ్వేశ్వర రావు, సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నారు. సోమవారం తొర్రూరులో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రైతాంగానికి రుణమాఫీ జరగలేదని చెప్పారు. మాజీ ఎంపీ సుబ్బిరామిరెడ్డికి మాత్రం రూ.5,700 కోట్ల రుణమాఫీ వెంటనే జరిగిందని, దీనివల్ల దేశంలోని ప్రజలకు తిండి పెట్టే రైతాంగం, వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకోని ఈ ప్రభుత్వాలు బడా కార్పొరేట్ వర్గాలకు రుణమాఫీ చేస్తున్నాయని, పేద, మధ్య తరగతి రైతులకు రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఓమ భిక్షపతి, లక్ష్మణ్, యాదగిరి, రమేష్, శ్యాంసుందర్, వెంకన్న, వీరన్న, రైతులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద బతుకమ్మలతో నిరసన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గునిగంటి రాజన్న

తొర్రూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న 270 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని కోరుతూ సీపీఎంపార్టీ ఆధ్వర్యంలో సామవారం ఇళ్ల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గునిగంటి రాజన్న, బొల్లం అశోక్, ఎండీ. యాకూబ్ మాట్లాడుతూ నిర్మించి ఉన్న ఇళ్లు పంపిణీ చేయాలని 4 నెలలుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో అర్హులైన లబ్ధిదారులు వందల సంఖ్యలో ఉన్నారని, ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. గత ప్రభుత్వం నిర్మాణం పూర్తిచేసినా అర్హులకు పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలని, లేనిచో లబ్ధిదారులు దసరా రోజు ఇళ్లలో గృహప్రవేశం చేస్తారని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీను, మమత, శోభ, దర్గయ్య, యాకన్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. గ్రీన్ పార్క్!

- విష కీటకాలకు నిలయం
- వణికిపోతున్న విజిటర్స్, వాకర్స్
- ఆహ్లాదం దేవుడెరుగునని ఆందోళన
- అధికారులు పట్టించుకోవాలని విన్నపం



పార్క్‌లో పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

మరిపెడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని గ్రీన్ పార్క్ పేరు వింటేనే పట్టణ ప్రజలు అమ్మో అంటున్నారు. ఏపుగా పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి గ్రీన్ పార్క్ విష కీటకాలకు నిలయంగా మారిందని విజిటర్స్, వాకర్స్ నిత్యం వణికిపోతున్నారు. ఆహ్లాదం ఏమో దేవుడెరుగునని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతంలో బాగున్నా ఇప్పుడేమో రెడ్ జోన్‌ను తలపిస్తుందని జనం వాపోతున్నారు. వాకర్స్, వ్యాయామం కోసం వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నా పార్క్ అభివృద్ధిపై ఏ మాత్రం పట్టింపులేదని పట్టణ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

రూ.1.75 కోట్లతో పార్క్ ఏర్పాటు

తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ నిధుల ద్వారా రూ.1.75 కోట్లతో అప్పటి ప్రభుత్వం గ్రీన్ పార్క్‌ను అన్ని హంగులతో నిర్మించింది. పిల్లల ఆటపాటల కోసం జారుడు బండ, ఊయ్యాలలు, రంగుల రట్నం, నిచ్చెనలు ఏర్పాటు చేయించారు. యువత, వృద్ధుల కోసం పలు వ్యాయామ పరికరాలను అమర్చారు. పార్క్‌లో ఆహ్లాదాన్ని పంచేలా రకరకాల మొక్కలను నాటారు. గ్రీన్‌పార్క్ చుట్టూ వాకర్స్ కోసం సీసీ రోడ్డు నిర్మించారు. పార్క్ చుట్టూ, మధ్యలో ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేసి చూపరులకు చూడముచ్చటగా పార్క్‌ను అప్పటి యంత్రాంగం తీర్చిదిద్దింది. అలాగే ఇనుప కంచెలతో పహారి నిర్మించారు.



గ్రీన్ పార్క్‌లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి

ఇప్పుడది రెడ్ జోన్..

మరిపెడ గ్రీన్ పార్క్ ఇప్పుడు రెడ్ జోన్‌ను తలపిస్తోంది. ప్రాంగణం, బయట పిచ్చిచెట్లు, గడ్డి ఏపుగా పెరిగి విష కీటకాలకు నిలయమైంది. కోడికూయక మునుపు నుంచే వాకర్స్ విజిటర్స్, యువత పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలతో క్షణమొక యుగంగా పార్క్‌లో గడుపుతున్నారు. సాయంత్రం పిల్లలతో పేరెంట్స్ పార్క్‌కు చేరుకోవడం నిత్యకృత్యమైంది. విషకీటకాలతో ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు పార్క్ అభివృద్ధికి పాటుపడి పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

నిత్యం భయమేస్తుంది..



గ్రీన్ పార్క్ అంటేనే నిత్యం భయమేస్తుంది. పార్క్ నిర్మించిన మొదట్లో జనం సందడి కనిపించేది. దాని అభివృద్ధిపైఅధికారులకు పట్టింపులేక రోజురోజుకు పార్క్ ప్రజల ఆదరణ కోల్పోతుంది. ఇప్పటికైనా పార్క్ అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలి.

– గోగ్‌నాథ్ గోపి, రాంవిలాస్ గల్లీ మరిపెడబంగ్లా

గ్రీన్ పార్క్‌ను వదిలేశారు..



పాలకులు, అధికారులు మరిపెడ గ్రీన్‌పార్క్‌ను వదిలేశారు. సాయంత్రం పిల్లలు పార్క్‌కు పోదామని ఎంత మొరపెట్టుకున్నా విష కీటకాల భయానికి అక్కడికి తీసుకెళ్లట్లేదు. గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి ఉండడంతో ఎక్కడ ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని ప్రతి ఒక్కరూ వణికిపోతున్నారు.

– మౌర్య మంజుల, బస్టాండ్ సెంటర్ మరిపెడబంగ్లా



పెద్ద చెరువు మత్తడి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న సోమయ్య

కేసీఆర్ కృషితో చెరువులకు జలకళ

తొర్రూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్‌తోనే చెరువులు జలకళను సంతరించుకున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కర్నె సోమయ్య అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తొర్రూరు పెద్ద చెరువు మత్తడి పోస్తున్న నేపథ్యంలో చెరువు వద్ద గంగమ్మ తల్లికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీ కాలువల ద్వారా చెరువులకు నీరందేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు వర్షాలకు, ఎరువులకు, యూరియా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, జైసింగ్, కర్నె నాగరాజు, కుర్ర శ్రీను, ఆర్.వెంకన్న, జంపా, ఆశయ్య, ఉపేందర్, ఉప్పలయ్య, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిన్నగూడూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు మంజూరైన రూ.8.41 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌ల సహకారంతో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధగాని నాగేష్, పట్ల కిరణ్, బర్తపురం యాకన్న, డీఎస్.మేగ్యానాయక్, వెంకట్య, బిక్కు, కంచనపల్లి రమేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మెరుగైన వైద్యసేవలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాథోడ్

చిన్నగూడూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంతో మహిళలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని జిల్లా వైద్యాధికారి రవిరాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఉగ్గంపల్లి పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పథకంలో భాగంగా మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ విభాగాల వైద్య నిపుణులచే పలువురు మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం కింద మహిళల ఆరోగ్యానికి సంరక్షణ సేవలందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వలీఉద్దీన్, నర్సింగ్ ఆఫీసర్ మాధవి, రాధాకుమారి, సుమలత, తార, బిచ్యా, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మరిపెడ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

మరిపెడ(ఆంధ్రజ్యోతి): మరిపెడ పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోగుల వార్డును సందర్శించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంలో భాగంగా మరిపెడ పీహెచ్‌సీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే పాల్గొంటున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రవి, పూజిత, పీహెచ్ఎన్‌వో మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉగ్గంపల్లిలో వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబసభ్యులు
- జిల్లా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌పై దాడికి యత్నం





షాహిదాబేగం (ఫైల్), వైద్యుడితో వాగ్వాదం చేస్తున్న బంధువులు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఓ మహిళా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కురవి మండలం నల్లెల్ల గ్రామానికి చెందిన ఎస్‌కె షాహిదాబేగం (55) షుగర్‌లేవల్ పెరగడంతో 108 వాహనంలో వచ్చి ఆస్పత్రిలో చేరింది. చికిత్స అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. వైద్యులు అందుబాటులో లేరని, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే షాహిదాబేగం మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు సర్ది చెప్పి పరిస్థితిని చక్కదిద్దారు.

స్పృహతప్పి పడిపోయిన సూపరింటెండెంట్ ..

వైద్యుల నిర్లక్ష్యంతోనే ఎస్‌కె షాహిదాబేగం మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుపై దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించడంతో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు బీపీ లేవల్ తగ్గిపోయి స్పృహతప్పి కిందపడిపోయాడు. సిబ్బంది అప్రమత్తమై ఆస్పత్రిలోని ఐసీయూకు తరలించి చికిత్స అందించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భూక్య రవిరాథోడ్, ఆర్ఎంవో జగదీష్, వైద్య సిబ్బంది బాధితున్ని పరామర్శించారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన..


జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేశారు. దాడికి యత్నించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యులపై ఫిర్యాదు చేశారు. కాగా, సూపరింటెండెంట్ శ్రీనివాసరావుపై దాడికి ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూప్రసాద్ రాథోడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ కొమురయ్య సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డాక్టర్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.



జిల్లా ఆస్పత్రి ఆవరణలో నల్లబ్యాడ్జీలతో ఆందోళన చేస్తున్న వైద్యులు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

తొర్రూరులో ఘనంగా ప్రారంభమైన వేడుకలు



పూజలందుకుంటున్న భద్రకాళి అమ్మవారు

తొర్రూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు పట్టణంలోని భద్రకాళి దేవాలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమైనట్లు ఆలయ ప్రధాన అర్చకులు వెన్నప్ప సంతోష్ శర్మ తెలిపారు. సోమవారం పాడ్యమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ(విజయదశమి) వరకు అమ్మవారిని ప్రతిరోజు వివిధ రూపాల్లో అలంకరించడం జరుగుతుందని తెలిపారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారి భక్తులు మాలలు ధరించి భద్రకాళి దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. ఆలయంలో చండీ హోమం, సరస్వతి దేవి హోమం, అక్షరాభ్యాసం, విజయదశమి రోజున వాహన పూజలు, సాయంత్రం 6గంటలకు జమ్మి పూజ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తగూడ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంచగూడెంలో ఆదివారం మృతి చెందిన శెట్టి మౌనిక కుటుంబసభ్యులను పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కోడలు, ములుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కుంజ కుసుమాంజలి పరామర్శించారు. సోమవారం మౌనిక మృత దేహనికి ఆమె పూలమాల వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు నామోజు కృష్ణ ఉన్నారు.

కొత్తగూడ అభివృద్ధిపై సీతక్క శ్రద్ధ

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య



సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొత్తగూడ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడ మండలం అభివృద్ధిపై పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య పేర్కొన్నారు. సెంట్రల్ లైటింగ్ పనుల కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరైన సందర్భంగా కొత్తగూడలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెం ట్రల్ లైటింగ్ పనులకు నిధులు మంజూరు చేసిన సీఎంకు, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారాయణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడు కర్ర జనార్ధన్‌రెడ్డి, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ బొల్లు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, నాయకులు బోయినేని ప్రశాంత్‌రెడ్డి, దేవర శ్యాం, సోముల ప్రశాంత్, వల్లెపు రంజిత్, భూర్క నరేందర్, అజ్మత్ పాష, కట్రోజు భిక్షపతి, కేదాసు ప్రసాద్, వెలుదండి వేణు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

డోర్నకల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో శరీరం కాలి చికిత్స పొందుతూ.. వృద్ధురాలు మృతి చెందిన సంఘట న ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన పోటు వరమ్మ (90) పది రోజుల క్రితం తన ఇంటి వద్ద ఉన్న చెత్తను తగులబెడుతుండగా మంటలు చెలరేగి ఆమె చీరకు అంటుకున్నాయి. ఈ ఘటనలో వరమ్మ శరీరం కాలి గాయాలు కావడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. వరమ్మ కుమారుడు రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్పీని కలిసిన వల్లూరి కృష్ణారెడ్డి

చిన్నగూడూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను రాష్ట్ర ఆయిల్ పామ్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు వల్లూరి కృష్ణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. యూరియా కష్టకాలంలో పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి మీరందించిన సహకారం రైతులు మరిచిపోరని, రైతుల పక్షాన అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.



ఎస్పీకి మొక్క అందజేస్తున్న కృష్ణారెడ్డి

నేల వాలిన వరి పంట

పెద్దవంగర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు కళ్లెదుటే నేల వాలడంతో రైతులు కంటతడి పెట్టారు. మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వడ్డెకొత్తపల్లి గ్రామంలో కురిసిన గాలివాన బీభత్సానికి చేతికొచ్చిన వరి నేల పాలైంది. కాగా, పంటలు నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వడ్డెకొత్తపల్లిలో నేలవాలిన వరిపంట

అమ్మవారి అనుగ్రహం
అందరిపై ఉండాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య
- వేయిస్తంభాల ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు షురూ

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శరన్నవరాత్రి వేడుకలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవ, ధ్వజారోహణం నిర్వహించి గణపతిపూజ, నవగ్రహారాధన, మండపారాధన, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన, కలశస్థాపన, అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు జరిగే ఈ వేడుకలను వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అమ్మవారిని తొలి రోజు బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. అమ్మవారికి నీరాజన మంత్ర పుష్పం అనంతరం పులగం నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో గణపతి నవగ్రహ రుద్రసహిత సుదర్శన హోమాన్ని లోకకల్యాణం నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ వారితో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



రుద్రేశ్వరాలయంలో నవరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

బతుకమ్మ విజేతలకు బహుమతులు

ప్రతియేటా మాదిరిగా రాధేశ్యామ్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పాటల పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి హనుమకొండ కాపువాడకు చెందిన దివ్య, ద్వితీయ బహుమతి మచిలీబజార్‌కు చెందిన జ్యోతి, తృతీయ బహుమతి కొత్తురుజెండాకు చెందిన సరోజనతోపాటు మరో 40 మందికి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీ కావ్య ఈ సందర్భంగా చెప్పారు. కొంత మంది పురావస్తు శాఖ సిబ్బంది ఆలయంలో నవరాత్రి వేడుకలకు అడ్డంకులు కల్పించిన నేపథ్యంలో స్వయంగా పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ అనుమతితో వేడుకలు నిర్వహించుకుంటున్నామని చెప్పారు.

ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసారి దేవీ శరన్నవరాత్రి వేడుకలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ముఖ్య దాతలుగా వ్యవహరిస్తుండటం విశేషం. గుడిమెల్ల విజయ కుమారాచార్యులు, సందీప్, కార్పొరేటర్ తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మయూరి నాట్య కళాక్షేత్రం నిర్వాహకురాలు కుండె అరుణ రాజ్‌కుమార్ శిష్య బృందంచే కూచిపూడి సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. అదే విధంగా హనుమకొండలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన పద్మాక్షి ఆలయంలో భక్తుల కోలాహలం మధ్య సోమవారం నుంచి అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఆలయ అనువంశీయ ధర్మకర్త నాగిళ్ల శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు షణ్ముఖ అవధాని నేతృత్వంలో పూజాదికాలు నిర్వహింపజేసి వేడుకలను ప్రారంభించారు.

స్థానిక ఎన్నికలు నిర్వహించే
దమ్ము సీఎంకు లేదు

- ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు
- వరంగల్ ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లతో కలిసి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మేడారం పర్యటనకు వస్తున్న రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పి మేడారంలో అడుగుపెట్టాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని రాష్ట్ర మంత్రులు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా ఆరు గ్యారంటీలు, రేవంత్‌రెడ్డి పాటలు వేసి బతుకమ్మలను అవమాన పర్చారని విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 250 చోట్ల యూరియా కోసం క్యూలో నిలబడుతున్నారని, కాంగ్రెస్ వైఫల్యంతో యూరియా కొరత సృష్టిస్తున్నారని విమర్శించారు. లక్షా 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని ప్రభుత్వం చెబుతుందని పది రోజులు గడిచిపోయిందని అదను తప్పిన తర్వాత యూరియా ఉపయోగం ఉండదని అన్నారు. మేడారం సమ్మక్క- సారలమ్మ సాక్షిగా రైతులకు ఇచ్చిన హామీలు రూ. 275 కోట్ల బోనస్ పెండింగ్‌లో ఉందని, రుణమాఫీ 46 శాతం మించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని అన్నారు. రాబోయే మేడారం జాతరకు రామప్ప, లక్నవరం ప్రాజెక్టుపై సీఎం రివ్యూ చేసి స్పష్టమైన ప్రకటన చేయాలని జాతర వరకు గోదావరి జలాలు జంపన్న వాగు ద్వారా మేడారం జాతరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్‌వీ నాయకుడు మాచర్ల శరత్‌చంద్ర, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్ డెయిరీ సభ్యులకు దసరా బోనస్

23 వేల మంది సభ్యులకు లబ్ధి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ముల్కనూర్ మహిళా డెయిరీ సభ్యులకు రూ. 15.70కోట్ల బోనస్‌ను అందిస్తున్నట్లు డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్‌రెడ్డిలు వెల్లడించారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార మహిళా డెయిరీలో సోమవారం వారు విలేకరు లతో మాట్లాడారు. ఈ సంవత్సరం 2.50కోట్ల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించామన్నారు. అప్పుడు రైతులకు వారి పాల నాణ్యతను బట్టి ప్రతి నెలలో బిల్లులు చెల్లించామన్నారు. ప్రస్తుతం సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా డెయిరీ సభ్యులకు రూ. 15.70 కోట్లు బోనస్‌గా చెల్లిస్తున్నామన్నారు. పాల అమ్మకాల్లో వచ్చిన లాభాల్లో నుంచి ఈ బోనస్‌ను అందిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ

రైతు పోసిన ప్రతి లీటర్ పాలకు రూ. 6.22 పైసలు బోనస్‌గా అందిస్తున్నామని తెలిపారు. డెయిరీ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాలోని 23వేల మహిళా డెయిరీ సభ్యులకు బోనస్ లబ్ధి చేకూరు తుందన్నారు. మంగళవారం నుంచి రైతుల ఖాతాల్లోకి డబ్బులను నేరుగా జమ చేస్తామన్నారు.

పత్తి దిగుమతులపై సుంకం కొనసాగించాలి

- పత్తి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి
- హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్



రైతుల సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

గిర్మాజీపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 11 శాతం సుంకాన్ని తిరిగి కొనసాగించాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవనంలో రైతు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసి పత్తి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. కేంద్ర ప్రభుత్వం పత్తిదిగుమతులపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేయడంతో 60 లక్షల మంది పత్తి రైతు కుటుంబాల పరిస్థితి ఆగమ్యగోచరంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు లేక పత్తి రైతులు అప్పుల పాలవుతున్నారని విమర్శించారు. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలో 767 మంది ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసర్ కె.వెంకటనారాయణ మాట్లాడుతూ.. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం కొనసాగించేలా రైతాంగం ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పత్తికి రు.12 వేలు మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రాష్ట్రంలో పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేయాలని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలుచేసిన వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని తీర్మానం చేశారు. ఈ సదస్సులో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా కన్వీనర్ సోమ రామ్మూర్తి, ఎం.డి.హశాస్సేన్, సుధమల్ల భాస్కర్, వెంకన్న, నగేష్, పత్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి కొత్త రూపు

5వ పేజీ తరువాయి

పగిడిద్ద రాజు, గోవిందరాజులు ఈ ఇరుకు ప్రాంగణంతోనే ఉండటంతో ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో మేడారం మాస్టర్ ప్లాన్‌లో గద్దెల ప్రాంగణం విస్తరించాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి ప్రాంగణ గోడల నుంచి అన్ని వైపులా 20 ఫీట్ల మేర విస్తరించాలని నిర్ణయించారు. దేవాదాయశాఖకు చెందిన 4 ఎకరాలు, ప్రభుత్వ భూమి 19 ఎకరాలు మొత్తం 23 ఎకరాల భూమిని సేకరించి గద్దెల ప్రాంగణం విస్తరణతో పాటు అతిథి గృహాలు నిర్మించాలనే ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నారు. దీంతో ప్రైవేటు, అసైన్డ్ భూముల సేకరణ పెద్దగా ఇబ్బంది ఉండదని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా భక్తులకు కూడా దర్శనం సులభం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే తల్లుల దర్శనానికి నాలుగు దిక్కుల ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నాలుగు ప్రవేశ ద్వారాలతో లోపలికి వచ్చిన భక్తులు.. తల్లులను దర్శించుకుని బయటకు వెళ్లేందుకు నాలుగు ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో భక్తులు బయటకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

జంపన్నవాగులో నీటి నిల్వ

మేడారం జాతరలో జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించటం సంప్రదాయంగా వస్తోంది. జాతర సమయంలో లక్నవరం సరస్సు నుంచి విడుదల చేస్తారు. మేడారం పర్యాటక ప్రాంతంగా మారడంతో ప్రతిరోజూ భక్తులు వస్తున్నారు. ముఖ్యంగా సెలవు దినాలు, పండుగలు, ప్రత్యేక కార్యక్రమాలను కూడా మేడారంలో నిర్వహించుకునేందుకు భక్తులు వస్తున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేయడం సంప్రదాయం కావటంతో జాతరేతర రోజుల్లో నీళ్ల లేకపోవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జంపన్నవాగులో ఏడాదంతా నీటిని నిల్వ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జంపన్నవాగుపై రెండు, మూడు చోట్ల చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

2018 మహాజాతర సమయంలో అప్పటి ప్రభుత్వం జంపన్నవాగుపై నార్లాపూర్ చింతల క్రాస్ రోడ్డు, గుండ్లమడుగు, రెడ్డిగూడెం, ఊరట్టం వద్ద సుమారు రూ.16 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్‌లు నిర్మించారు. అయితే 2020 మహాజారత నాటికి ఈ చెక్‌డ్యామ్‌లలో పడి సుమారు 15 మందికి పైగా భక్తులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలకు జంపన్నవాగులో నీరు ప్రవహించకుండా అడ్డుకట్ట వేయటమే కారణమని భక్తులు విశ్వసించారు.

దీంతో నార్లాపూర్ చింతల క్రాస్ రోడ్డు వద్ద నిర్మించిన చెక్ డ్యామ్ మినహా మిగతా మూడు చెక్ డ్యామ్‌లను గత ప్రభుత్వం కూల్చేసింది. ఈ కూల్చివేతలకు రూ.2.30 కోట్ల వరకు ఖర్చు చేసింది. దీంతో కోట్లాది రుపాయల నిధులు నీళ్లపాలు చేశారనే విమర్శలను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూడా ప్రభుత్వం ఇలాంటి ఆలోచనే చేస్తుందనే టాక్ వినబడుతోంది. భక్తుల విశ్వాసాలకు భంగం కలుగకుండా జంపన్నవాగులో నిరంతరం నీళ్ల పారేలా ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

నేడు సీఎం మేడారం పర్యటన

మహాజాతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మేడారానికి ముఖ్యమంత్రి రావడం చరిత్రలో తొలిసారి. 2016లో అప్పటి ప్రభుత్వం మేడారం మహాజాతరకు రూ.150.50 కోట్ల నిధులు కేటాయించింది. కానీ, పనుల ప్రారంభానికి సీఎం హాజరు కాలేదు. ప్రస్తుత జాతరకు రూ.150కోట్లు కేటాయించటంతో పాటు ఆ పనులకు శంకుస్థాపన చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రావటంపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2026 జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులను కేటాయించింది.

2024 జాతరకు ప్రభుత్వం ఆలస్యంగా రూ.115కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటిలో సుమారు రూ.25 కోట్ల పనులు అప్పట్లో జరగకపోవటంతో.. ఇటీవల ఆ నిధులతో మేడారంలో బీటీ రోడ్లతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అతిథి గృహాలను నిర్మిస్తున్నారు. ఈ అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మేడారం పర్యటనలో ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే గద్దెల కొత్త డిజైన్ పనులు, గద్దెల ప్రాంగణం విస్తరణ పనులను సీఎం ప్రారంభించనున్నారు. వీటితో ఐలాపూర్ వరకు రోడ్డు నిర్మాణం, జాతరలో సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి సీతక్క మేడారంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పండుగ వేళ విషాదం

- బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో మహిళ మృతి
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన



విషాదంలో భర్త, చిన్నారులు



శెట్టి మౌనిక (ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎంగిలిపూల బతుకమ్మ రోజు అందరి ఇళ్లలో సంతోషాన్ని నింపితే.. ఓ కుటుంబంలో మాత్రం విషాదాన్ని నింపింది. ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో బతుకమ్మ ఆడేందుకు ఇంటి నుంచి అనందంతో వెళ్లిన మహిళ శవంగా తిరిగివచ్చింది. అప్పటి వరకు అందరితో కలిసి బతుకమ్మ ఆడిన ఆమె మృతి చెందటంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. బతుకమ్మ ఆటఆడుతూ ఒక్కసారి గుండెపోటు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన ఎంచగూడెంలో ఆదివారం రాత్రి జరిగింది. మృతురాలి కుటుం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తగూడ మండలంలోని ఎంచగూడెం గ్రామానికి చెందిన శెట్టి పరశురాం-మౌనిక (32) దంపతులకు కుమార్తెలు సాహితి, సాయిత్రి, కుమారుడు మన్విత్ ఉన్నారు. భర్త బ్యాం కుమిత్రగా పని చేస్తుండగా, భార్య మౌనిక ఎంచగూడెంలో జిరాక్స్ సెంటర్ నడుపు తోంది. ఆదివారం సాయంత్రం బతుకమ్మ ఆడేందుకు బతుకమ్మతో మహిళలతో కలిసి గ్రామంలోని బొడ్రాయి వద్ద చేరుకొంది. బతుకమ్మ ఆడుతూ ఒక్కసారిగా మౌనిక గుండెపోటు వచ్చి, పడిపోయింది. గమనించిన భర్త, కుటుంబసభ్యులు ఆమెను నర్సంపేట లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.



రాణిరుద్రమ నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కవులు, కళాకారులకు ఓరుగల్లు పెద్దపీట

- సంగీత నాటక ముగింపు వేడుకల్లో ఎంపీ కడియం కావ్య
- అలరించిన ప్రజా సాహిత్య కళారూపాలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన కాకతీయ నృత్య కళారూపాల ముగింపు వేడుకలను ఎంపీ కడియం కావ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అకాడమీ చైర్మన్ డాక్టర్ అలేఖ్య పుంజాల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ వరంగల్ అంటేనే కవులకు, కళాకారులకు అనాదిగా నిలయంగా బాసిల్లుతుందన్నారు. మహాకవి బొమ్మెర పోతన, పాల్కుర్కి సోమనాథుడు మొదలు కాళోజీ దాక అనేక మంది మహానుభావుల వారసత్వాన్ని స్వీకరించిన కవులు, రచయితలు నేరెళ్ల వేణుమాధవ్ లాంటి అగ్రశ్రేణి కళాకారులకు ఈ గడ్డ వేదికగా నిలిచిందన్నారు. ఇలాంటి ప్రదేశంలో సంగీత నాటక అకాడమి, రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహించిన ముదావహం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కవులకు, కళాకారులకు బాసటగా నిలుస్తుందన్నారు. వరంగల్‌ను సాంస్కృతిక కేంద్రంగా రూపొందించేందుకే కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అలరించిన రాణిరుద్రమ

ఈ సందర్భంగా వరంగల్ డ్రమెటిక్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన రాణిరుద్రమ నృత్య రూపకం విశేషంగా అలరించింది. అలనాటి కాకతీయుల చరిత్రను కళ్ల ముందు నిలిపింది. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని వీరత్వం రుద్రమదేవి పరాక్రమం ప్రేక్షకులచే కరతాళ ధ్వనులు కొట్టించింది. అదే విధంగా గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొడుస్తున్న పొద్దుమీద లాంటి జనరంజక పాటలు ప్రజా కళాకారుల ప్రదర్శన వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమాల విజయవంతం నేపథ్యంలో ఇకనుంచి రాష్ట్రంలోని అన్ని పాత జిల్లా కేంద్రాల్లో సంగీత నాటక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అలేఖ్య పుంజాల ప్రకటించారు.

తాత్కాలిక బదిలీలపై గందరగోళం

- అనాలోచితంగా నిబంధనలు
- ఒకే జిల్లాలో కొనసాగుతున్నవారి సంగతేమిటి ?
- సీనియారిటీ ప్రాతిపదికనే కేటాయించాలి
- నష్టపోయిన వారికి తాత్కాలిక బదిలీల్లో అవకాశం కల్పించాలి
- బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగుల డిమాండ్



హనుమకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల తాత్కాలిక బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 190పట్ల కొందరు ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో ఊరట వ్యక్తం అవుతుండగా జీవో 317 బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగులు మాత్రం నిరసిస్తున్నారు. జీవో 190 అసంబద్ధ, అనాలోచితమైనదిగా అభివర్ణిస్తున్నారు. ఇతర జిల్లాలు, జోన్లకు బదిలీ అయి ఇబ్బంది పడుతున్న ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనం కల్పించేలా మంత్రివర్గం ఉప సంఘం చేసిన సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. జీవో 317 ద్వారా ఒక జోన్ నుంచి మరో జోన్‌కు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయిన వారికి న్యాయం జరిగేలా జారీ చేసిన జీవో 190 కొంత మంది ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మాత్రమే లాభం జరిగేలా ఉందన్న అసంతృప్తి జీవో 317 బాధిత ఉపాధ్యాయ, ఉద్యోగుల్లోనూ వ్యక్తం అవుతోంది. జీవో 317లో సీనియారిటీ ప్రాతిపదికగా జిల్లాల కేటాయింపు జరిగినందువల్ల పలువురు ఉద్యోగులు వారు సుదీర్ఘకాలంగా పని చేస్తున్న జిల్లాలోనే తిరిగి కొనసాగే పరిస్థితి ఏర్పడింది. వారి సంగతి ఏమిటని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

సీనియారిటీ ప్రాతిపదికనే బదిలీలు చేయాలి

జీవో 317లో సీనియారిటీ ప్రాతిపదికన జిల్లాల కేటాయింపు జరిగినందువల్ల మళ్లీ అదే విధంగా ఇప్పుడు ఇచ్చిన తాత్కాలిక బదిలీలను కూడా సీనియారిటీ ప్రాతిపదికనే ఇవ్వాలని 317 జీవో బాధిత ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మ్యూచువల్ బదిలీలను జీవో నెంబర్ 21 ద్వారా చేపట్టారు. ఆ తర్వాత మళ్లీ జీవో 243 ద్వారా మెడికల్ గ్రౌండ్, జీవో 244 ద్వారా స్పౌజ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులను వారి వారి జిల్లాలకు కేటాయించారు. ఈ క్రమంలో జీవో 317కి ముందు ఎస్‌జీటీగా ఉన్న ఉపాధ్యాయులను ఈ జీవో తర్వాత పదోన్నతిపొందగా వారిని స్పౌజ్ ఉన్న జిల్లాలకు కేటాయించారు. ఇది జీవో 317కు విరుద్ధమని చెబుతున్నారు. ఎందుకంటే జీవో 317లో ఒక జిల్లాను కేటాయించిన తర్వాత పదోన్నతి పొందినవారు స్పౌజ్‌లో ఇంకో జిల్లాకు వెళ్లడం అంటే అ వ్యక్తికి జీవో 317 వర్తించనట్టేనంటున్నారు. మళ్లీ మ్యూచువల్ బదిలీలకు సంబంధించి జీవో 245 ద్వారా చేపట్టిన బదిలీల్లో కూడా జీవో 317కు ముందు ఒక క్యాడర్‌లో ఉండి తర్వాత పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు కూడా మ్యూచువల్ బదిలీలో అవకాశం కల్పించారని, ఇది కూడా జీవో 317కు వ్యతిరేకమని అంటున్నారు. జీవో 317 ద్వారా జిల్లాలు కేటాయించినప్పుడు రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించి జిల్లాలను కేటాయించారు. కానీ పరస్పర బదిలీల్లో, స్పౌజ్ బదిలీల్లో మొదట కేటాయించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించపోవడం మరొక అన్యాయమేనని వాపోతున్నారు.

190 అసంబద్ధ జీవో

ఇక ఇప్పుడు జీవో 317 బాధితుల ఉపశమనం కోసం ప్రభుత్వం తాత్కాలిక బదిలీల కోసం జారీ అయిన జీవో 190లో జీవోలు 243, 244, 245, 21 జీవోలలో లబ్ధిపొందిన వారికి అవకాశం లేదన్నది స్పష్టం. ఇంత వరకు బాగానే ఉన్నా జీవో 317కు ముందు ఒక జిల్లా జీవో 317 తర్వాత ఒక జిల్లా ఉన్నవారికి మాత్రమే ఈ జీవోలో అవకాశం కల్పించారు. కానీ జీవో 317కు ముందు ఆ తర్వాత ఒకే జిల్లాలో పని చేసున్నవాళ్లకు అవకాశం లేదని ఈ జీవోలో పేర్కొన్నారు. అయితే ఇక్కడ జీవో 317కు ముందు, తర్వాత ఒకే జిల్లా కేటాయించబడిన వాళ్లు అప్షన్స్ ఇచ్చే క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లానే తీసుకుంటే ఆరు జిల్లాలుగా విభజన జరిగిందని, ఈ జీవో 317 వల్ల ఒక ఉద్యోగి ఆరు ఆప్షన్లు ఇవ్వాల్సి వచ్చిందని, దానిలో మొదటి ఆప్షన్‌గా ఒక జిల్లా రెండో ఆప్షన్‌గా ఇంకో జిల్లా ఇలా ఆరు ఆప్షన్లు ఇచ్చినప్పుడు అందులో మొదటి ఆప్షన్ కాకుండా మిగతా ఆప్షన్లు ఇచ్చిన జిల్లాకు కేటాయించడిన ఆ ఉపాధ్యాయులు, ఉద్యోగులు జీవో 317 బాధితుడే అవుడాని అంటున్నారు.

ఈ క్రమంలో జీవో 317కి ముందు పని చేసిన జిల్లాను కేటాయించినా అతడు కచ్చితంగా జీవో 317 జీవో బాధితుడే అవుతాడని పేర్కొంటున్నారు. కానీ వారు జిల్లా స్థానికులు కారు. ఆ జిల్లాలో చదవలేదు. అప్పుడున్న పరిస్థితుల్లో వారికి 20 ఏళ్ల సర్వీసు ఉన్నప్పటికీ బదిలీలలో ఎప్పటికీ ఆ జిల్లాలోని పాఠశాలల్లోనే కేటాయించారు. దానికి వారిని బాధ్యుల్ని చేస్తూ ఇలా అసంబద్ధ, అనాలోచిత జీవో జారీ చేయడం వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగ లోకానికి తీవ్ర నష్టం జరగడమే కాకుండా అనేక కొత్త సమస్యలకు దారి తీస్తుందని అభిప్రాయపడుతున్నారు. కనుక ప్రభుత్వం స్పందించి జీవో 317లో సీనియారిటీ ఆధారంగా కేటాయించినట్లే జీవో 190ద్వారా కూడా 317వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు గతంలో కేటాయించినప్పటి జాబితా ఆదారంగానే తాత్కాలిక బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

జిల్లాలు మారిన వారికే మళ్లీ అవకాశం

2024లో జరిగిన బదిలీల్లో జీవో 317కు ముందు ఒక జిల్లా జీవో 317 తర్వాత మరో జిల్లా కేటాయించబడిన ఉపాధ్యాయులలో గతంలో పని చేసిన జిల్లా పాఠశాల పాయింట్లతో బదిలీల్లో లబ్ధి పొంది ప్రస్తుతం పని చేస్తున్న జిల్లాల్లో దగ్గరి ప్రాంతం, రవాణా సౌకర్యం ఉన్న పాఠశాలలకు బదిలీ అయ్యారు. మరి ఇలా బదిలీల్లో జీవో 317కు ముంద తర్వాత ఒకే జిల్లాలో ఒకే పాఠశాలలో పని చేసిన వారికి వర్తించిన పాయింట్లను జీవో 317కి ముందు ఒక జిల్లా ఆ తర్వాత ఒక జిల్లా కేటాయించబడిన వారికి కూడా ఒకే రకమైన విధానాన్ని అనుసరించిన ప్రభుత్వం ఇప్పుడేమో జీవో 190 ద్వారా జిల్లాలను మారిన వారికే అవకాశం కల్పించడం శోచనీయమని అంటున్నారు.

వయోవృద్ధుల మల్టీ డేకేర్ సెంటర్‌కు దరఖాస్తుల స్వీకరణ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వయోవృద్ధుల మల్టీ డే కేర్ సెంటర్ నడుపుటకు స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీ సర్వీస్ డే కేర్ సెటర్ నిర్వహించే వారు తెలంగాణ సొసైటీ రిజిస్ట్రేషన్ 2001 కంపెనీ యాక్ట్ 1956 ఇండియన్ ట్రస్ట్ యాక్ట్ 1882 ద్వారా రిజిస్టరై ఉండాలన్నారు. ఎన్‌జీవోలు, సీనియర్ సిటిజన్, ఓల్డ్ ఏజ్, చిల్డ్రన్స్‌హోం, షెల్టర్‌హోం నిర్వహించడంలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. అర్హత ఉన్నవారు ఈనెల 25 వరకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్‌లు 9642174243, 8978698912 లను సంప్రదించాలన్నారు.

28న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

ఇనుగుర్తి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి జడ్పీహైస్కూల్ ఆవరణలో ఈ నెల 28న కందునూరి కొమురయ్య స్మారక జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ వాలీబాల్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం వెల్లడించారు. ఒకరోజు నిర్వహించే ఈ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాల్లో విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని, క్రీడాకారులకు భోజన, వసతి కల్పిస్తామని, బస్సు చార్జీలను సైతం చెల్లించనున్నట్లు తెలిపారు. వివరాలకు పీడీలు బొబ్బిలి వెంకట్‌రెడ్డి 98491 28440, కె.గీత 94416 13725 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇందిరమ్మ బిల్లు రూ.లక్ష వాపస్ తీసుకోండి

● జిల్లా కలెక్టర్‌కు వినతి

కేసముద్రం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : అధికారుల తప్పిదం వల్ల తమ ఖాతాలో జమ అయిన రూ.లక్ష ఇందిరమ్మ ఇంటి డబ్బులను వాపస్ తీసుకోవాలని కేసముద్రం స్టేషన్‌కు చెందిన షేక్ పర్వీన్ జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేసింది. 'ఇందిరమ్మ పథకంలో...ఇల్లు కట్టింది ఒకరు.. బిల్లు వచ్చింది మరొకరికి..' శీర్షికన ఆదివారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది పొరపాటుతో తన పేరున మంజూరైన ఇల్లు ఇదే పేరున ఉన్న మరో మహిళకు మంజూరైనట్లుగా నమోదు చేయడంతో తాను ఇల్లు కట్టుకోకపోయిన రూ.1లక్ష బిల్లు వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ బిల్లును ప్రభుత్వం వాపస్ తీసుకొని లబ్ధిదారుల జాబితాలో తన పేరును తొలగించాలని కోరారు.



కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు



మరిపెడలో దుర్గామాతకు పూజలు జరుపుతున్న అమ్మవారి మాలధారణగావించిన భక్తులు



మహబూబాబాద్ శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు

ఘనంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

● జిల్లా వ్యాప్తంగా మండపాల్లో కొలువుదీరిన దుర్గామాత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా దుర్గామాత దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాత విగ్రహాలు కొలువుదీరాయి. గ్రామాల్లో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దుర్గామాతను ఏర్పాటు చేశారు. ప్రతీ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవి నవ రాత్రులను నిర్వహించిన అనంతరం పదవ రోజున విజయదశమిని జరుపుకుంటారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొలువుదీరిన దుర్గామాత తొమ్మిది రోజుల పాటు ఒక్కొక్క వేషధారణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి మండలాలు, వివిధ గ్రామాలకు ప్రత్యేక వాహనాలపై నిర్వాహకులు అమ్మవారి విగ్రహాలను తీసుకువెళ్లారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వరీభవన్ (మార్వాడీసత్రం), శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాత అమ్మవారిని ఏర్పాటు చేసి ఆలయ ప్రధాన అర్చకుల వేధమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు.

వివిధ మండలాల్లో..

● డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జైన్‌భవన్, యాదవనగర్‌లలో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆయా కాలనీల్లో ప్రజలు కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● మరిపెడ మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు భక్తులు పెద్దఎత్తున పూజలు జరిపారు. అమ్మవారు త్రిపుర బాలసుందరిదేవీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితులు, అమ్మవారి మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

● సీరోలు మండలంతో పాటు కురవిలోని శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో దుర్గామాత విగ్రహాన్ని అర్చకుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు దుర్గాదేవి మాలలు ధరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బాలగాని శ్రీను, దొంగల జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు. కురవిలో 8 చోట్ల దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు.

రోజుకో అలంకరణలో అమ్మవారు..

జిల్లాలో సెప్టెంబరు 22న తొలిరోజు శ్రీబాల త్రిపురసుందరి అలంకరణలో భక్తుల పూజలు అందుకున్న అమ్మవారు, 23న శ్రీగాయత్రీదేవి అలంకరణ, 24న శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణ, 25న శ్రీకాత్యాయనిదేవి అలంకరణ, 26న శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణ, 27న శ్రీలలితా త్రిపురసుందరి అలంకరణ, 28న శ్రీమహచండీదేవి అలంకరణ, 29న శ్రీసరస్వతిదేవి అలంకరణ, 30న శ్రీదుర్గాదేవి అలంకరణ, అక్టోబరు 1న శ్రీ మహిషాసురమర్ధినిదేవి అలంకరణ, అక్టోబరు 02న శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు అందుకోనున్నారు.

● కేసముద్రం : కేసముద్రం మండల కేంద్రంలోని ఆర్యవైశ్యభవన్, సాయిబాబాఆలయం, ఉప్పరపల్లి, అర్పనపల్లి తదితర గ్రామాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. తొలిరోజు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్యభవన్‌లో కుంకుమార్చన జరిపారు.

నందిని నగర్ కాలనీలో చోరీ

● 2 తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు..

● రూ. 50 వేలు నగదు అపహరణ

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని నందినీనగర్ కాలనీలోని ఓ ఇంటిలో చోరీ జరిగిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టౌన్ సీఐ జి మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. అశోద సోమయ్య కొంత కాలంగా మహబూబాబాద్ పట్టణంలోని నందినీనగర్ కాలనీలో స్వంత ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నారు. ఈ నెల 18న ఇంటికి తాళం వేసి కుమారుడు ప్రశాంత్‌కు వివాహ సంబంధం మాట్లాడేందుకు భద్రాద్రి కొత్తగూడెంకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ప్రహరీ గేటు తాళం వేసి ఉండి, ఇంటి ప్రధాన ద్వారం తలుపులు తెరిచి ఉండడంతో పక్కింటి వారు సోమయ్యకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. కొత్తగూడెం నుంచి తిరిగి మహబూబాబాద్‌లోని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి బీరువా తెరిచి ఉండగా, అందులో బట్టలు చల్లాచదురుగా పడి ఉన్నాయి.



బీరువాలోని బట్టలు చల్లాచదురుగా పడేసి ఉన్న దృశ్యం

బీరువా లాకర్‌లో 2 తులాల బంగారు చైను, 15 తులాల వెండి నగలతో పాటు రూ. 50 వేలు నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకువెళ్లినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఫింగర్ ప్రింట్స్ క్లూస్ టీం అధికారులు వేలుముద్రల నమూనాలు సేకరించారన్నారు. ఊరు ప్రయాణం చేసేవారు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

● మేరా భారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మేరా యువ భారత్ ఉమ్మడి వరంగల్ జిల్లా యువజన వ్యవహారాలు, భారత క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడివరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించేందుకు యువజన సంఘాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేరా భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేరా యువ భారత్, యువజన సంఘాల సమన్వయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘంలోని సభ్యుల వయసు 18 నుంచి 29 లోపు ఉండాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే రిజిస్ట్రేషన్ చేసుకున్న, చేసుకోకపోయినాఆసక్తి గల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘాల ప్రతులను తీసుకుని హన్మకొండ కొత్త బస్టాండ్ సమీపంలోని మేరా యువ భారత్ కార్యాలయంలో ఈ నెల 27లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాల్లో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్ : 0870-2958776ను సంప్రదించాలని కోరారు.

అలుగు పోస్తున్న చెరువులు, కుంటలు

పాలకుర్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : వరుసగా కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు అలుగు పోస్తున్నాయి. గూడూరు, బమ్మెర, తొర్రూరు, ఈరవెన్ను గ్రామా ల్లోని చెరవులు మత్తడి పోస్తుండడంతో మల్లంపల్లి, వావిలాల, ముత్తారం, వల్మిడి, మంచుప్పుల, తీగారం గ్రామాల చెరువులు నిండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గూడూరు గ్రామంలోని ఊర చెరువు అలుగు పోస్తుండడంతో చెరువు నుంచి చేపలు వెళ్లకుండా మత్స్యకారులు అలుగు వద్ద భారీ వలను ఏర్పాటు చేశారు. మరో భారీ వర్షం పడితే రెండు రోజుల్లో నిండిన చెరువులన్నీ అలుగు పోస్తాయని రైతులు భావిస్తున్నారు.



అలుగు పోస్తున్న గూడూరు చెరువు

ఫటాఫట్

అణచివేతతోనే తెరపైకి గిరిపురం మండలం

- కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత



మరిపెడ బంగ్లాకు రోడ్డు ఇవతలి వైపు ఉన్న గ్రామాలపై గత పాలకులు అణచివేత ధోరణిని అవలంభించి అభివృద్ధిపై శ్రద్ధ పెట్టకపోవడం, రాజకీయ పదవులన్నీ రోడ్డు అవతలి గ్రామాల నేతలకు వర్తింప చేయడంతోనే గిరిపురాన్ని మండలం చేయాలని తెరపైకి తెచ్చి ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫటాఫట్ మాట్లాడుతూ గిరిపురం మండలం అయ్యేదాకా ఎన్ని అవాంతరాలు వచ్చినా తమ పోరాటం ఆపేదే లేదన్నారు.

ప్రశ్న : అణచివేత ధోరణి అంటే?

జవాబు : మరిపెడ బంగ్లాకు రోడ్డు ఇవతల ఉమ్మడి గ్రామాలు పది ఉండగా అభివృద్ధి అంతంత మాత్రమే. పది ఉమ్మడి గ్రామాలు ఇప్పుడు 30 జీపీలుగా ఏర్పడ్డాయి.

ప్ర : ఆ పది గ్రామాల్లో మీ ప్రాబల్యం ఎంత?

జ : పదికి పది గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అక్కడి ప్రజలంతా గిరిపురం మండలం ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మానాలు ఇచ్చారు. 35 వేల మంది ఓటర్లు ఉన్నారు.

ప్ర : రోడ్డు ఇవతలి గ్రామాలకు రాజకీయ పదవులు లేవా?

జ : ప్రధానమైన పదవులన్నీ రోడ్డు అవతలి వారికే చెందాయి. గత 40 ఏళ్లుగా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీతో పాటు ఎంపీపీలుగా ఆ ప్రాంత ప్రతినిధులే పదవులు అనుభవించారు. చిన్నచిన్న పదవులే ఇచ్చేటోళ్లు.

ప్ర : గిరిపురం మండలం ఏర్పాటుపై మీ పోరాటం ఎంత వరకు వచ్చింది?

జ : గత ప్రభుత్వం సుముఖంగా ఉండే. కానీ, ఈ ప్రాంత నేత అడ్డుపడ్డాడు. ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్ మద్దతుతో రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి గిరిపురం మండలంపై విన్నవించాం. మంత్రి సానుకూలంగా స్పందించారు.

- మరిపెడ (ఆంధ్రజ్యోతి)

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

● జేవీవీ గౌరవ అధ్యక్షుడు నాగయ్య

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా గౌరవ అధ్యక్షుడు షైన నాగయ్య అన్నారు. మహబూబాబాద్ సెవెన్ హిల్స్‌కాలనీలో పెత్రమాస పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి బతుకమ్మ పోటీలు నిర్వహించి, ఉత్తమ బతుకమ్మలను పేర్చిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో తీరొక్క పూల తో బతుకమ్మలను పేర్చి మహిళలంతా ఒకచోటా బతుకమ్మలను ఉంచి ఆడుతూ పాడుతూ తొమ్మిది రోజుల పాటు ఆనందంగా గడిపే అతి పెద్ద పండుగ బతుకమ్మ అని తెలిపారు. తెలంగాణలో అతిపెద్ద పూల పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ఈ పోటీల్లో 52 మంది మహిళలు బతుకమ్మలను పేర్చి ఎవరికి వారే విజేతలుగా నిలిచారని తెలిపారు. జేవీవీ బాధ్యులు చొప్పరి శ్రీనివాస్, ఆగుర్తి సురేష్, ఉప్పలపాటి శ్రీనివాస్, విజయ్‌రాజ్, సెవెన్‌హిల్స్ కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంజీవరెడ్డి, వెంకటరమణ, కాలనీ బాధ్యులు పాల్గొన్నారు.



సెవెన్ హిల్స్ కాలనీ బతుకమ్మ సంబరాల పోటీల్లో గెలుపొందిన ఎన్ఆర్ఐకు బహుమతి అందజేస్తున్న జేవీవీ బాధ్యులు

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కేసముద్రం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) :భూక్యారాంతండాలో ఆదివారం సాయంత్రం భూక్య రాములుకు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఎద్దుకోసం వేసిన షెడ్డులోని ఫ్యానుకు ఉన్న కరెంటు వైరు తెగిపోయి గడ్డిలో పడింది. ఎద్దు గడ్డిని మేస్తుండగా విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని సోమవారం బాధితుడు తెలిపారు. ఈ విషయంలో జిల్లా విద్యుత్‌శాఖ ఆదుకొని ఆర్థిక సహాయం చేయాలని ఆయన కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాములు అన్నారు.

సీపీఐ సభలకు జిల్లా నేతలు



కేరళ రెవెన్యూ మంత్రి రాజన్‌తో మానుకోట జిల్లా కార్యదర్శి విజయసారథి, ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రం చండీఘడ్ రాష్ట్రంలో ఈ నెల 21నుంచి 25 వరకు జరుగుతున్న భారతకమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీ య మహాసభలకు మానుకోట జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం దక్కింది. మహాసభలకు ప్రతినిధులుగా జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కట్టి బోయిన శ్రీనివాస్ హాజరయ్యారు. జాతీయ మహాసభలను పురస్కరించుకుని తొలిరోజు 21న బహిరంగ సభను నిర్వహించగా, 22న సోమవారం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ప్రతినిశుల సభలో ప్రస్తుత దేశ రాజకీయాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యచరణను రూపొందించనున్నట్లు జిల్లా కార్యదర్శి బి.విజయసారథి తెలిపారు.

మహిళలందరికీ చీరలు ఇవ్వాలి : బీజేపీ



కేసముద్రం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కేసముద్రం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల్లోని మహిళలకే కాకుండా రేషన్‌కార్డుల్లో ఉన్న మహిళలందరికీ చీరలను ఇవ్వాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్, ప్రధాన కార్యదర్శి బోగోజు నాగేశ్వరచారి ఆధ్వర్యంలో తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా లేరనే నెపంతో రేషన్‌కార్డుల్లోని మహిళలకు బతుకమ్మ చీరలను ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, నాగరబోయిన చంద్రకళ, చెలగొల వెంకన్న, రామడుగు వెంకటాచారి, మంగిశెట్టి నాగయ్య, మల్యాల రాములు, సింగంశెట్టి మధుకర్, బొల్లోజు వీరన్న, బేతి వెంకన్న, చక్రధరి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎవరికీ అన్యాయం జరగొద్దు

(5వ పేజీ తరువాయి)

అందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ టి.రాజేశ్వర్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ ఘంట సంజీవరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, రావుల మురళీ, అల్లం నాగేశ్వర్‌రావు, బండారు వెంకన్న, గుగులోతు దస్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి తనిఖీ..

మహబూబాబాద్ క్రైం : జిల్లా ఆస్పత్రిని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరును ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు మర్యాద పూర్వకంగా ఉండాలన్నారు. సకాలంలో వైద్యం అందించాలన్నారు. రోగుల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. అనంతరం ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సరఫరాకు మోటార్ అందచేత



క్యాంపుతండాలో తాగునీటి మోటార్‌ను ఏర్పాటు చేస్తున్న గ్రామస్థులు

కేసముద్రం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం క్యాంపుతండా జీపీ పరిధిలోని మాతృతండాలో బావి నుంచి తాగునీటి సరపరా అందించే మోటార్ చెడిపోవడంతో ఎమ్మెల్యే మురళీనాయక్ తన సొంతనిధుల్లోంచి రూ.50వేలు అందజేసి మోటార్‌ను ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే తరపున గుగులోత్ నరేష్ వచ్చి ఈ మోటార్‌ను బిగించి, సోమవారం స్విచ్ ఆన్‌చేసి నడిపించారు. తండాలో తాగునీటి ఇబ్బందులు తొలగిపోవడంతో తండావాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు ఇస్లావత్ రమేష్, బానోత్ మహేష్, వెంకన్న, సురేష్, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తమ్ముడి చేతిలో అన్న హత్య

వెంకటాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): ములుగు జిల్లాలో సోమవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. భూ వివాదా ల నేపథ్యంలో అన్నను తమ్ముడు చంపడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిరుతపల్లికి చెందిన గొంది లక్ష్మయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు కుమారుడు మాధవరావు (35), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో భార్యకు సాంబ శివరావు ఏకైక సంతానం. మాధవరావు వ్యవసాయ కూలీగాపని చేస్తున్నాడు. సాంబశివరావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తండ్రి లక్ష్మయ్య మృతి చెంద డంతో నుంచి వారసత్వంగా ఆరున్నర ఎకరాల భూమి ఉండగా ఇద్దరు అన్నదమ్ములు సమాన వాటాలుగా పంచుకున్నారు. ఈక్ర మంలో సాంబశివరావు తనకు సంక్రమించిన భూమిని అమ్ముకునే విషయంలో మాధవ రావును సంతకం పెట్టమని అడగ్గా అతను నిరాకరించాడు. భూమి అమ్ముకుంటే జీవనం సాగించడం కష్టంగా మారుతుందని అందుకు అంగీకరించలేదు. దీంతో భూమి అమ్ముకునే విషయంలో మాధవరావు అడ్డుపడుతున్నాడని సాంబశివరావు కక్ష పెంచుకున్నాడు.

ఈ నేపథ్యంలో సోమవారం మాధవరావు ఇంటికి మధ్యాహ్నం సమయంలో వెళ్లిన అతడు భూమి విషయంలో గొడవపడ్డాడు. ఈక్రమంలో మాటామాటా పెరగడంతో ఆవేశానికిలోనైన సాంబశివ రావు గడ్డపారతో మాధవరావు తలపై బలంగా కొట్టడ్డాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై మెదడు బయటకు వచ్చి మాధవరావు అక్కడికక్కడే మృతిచెం దాడు. సమాచారం అందుకున్న వెంకటాపు రం ఎస్సై కొప్పుల తిరుపతిరావు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి చెల్లెలు కోరం నిర్మల ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.